లేకుంటే మరో బస్సులో రండి, మేం పోతాం- నాకు కోర్టు పనివుంది"

అన్నాడు విసురుగా కోర్టు మనిషి—

"అలాగే..." బీక్కరంగా అన్నాడధికారి.

"అవును సార్-వస్తే రండి—లేకపోతే మేం వెళ్ళిపోదాం-" అంటూ యిద్దరంవచ్చి బస్సులో కూచుని

పోనిమ్మన్నాం.

"అయ్యా- వీళ్ళతోటే వుంది మా బ్రతుకు. కత్తికి రెండువైపులా దారుంటుది-" అన్నాడు కండక్టరు ప్రాధేయపూర్వకంగా.

"అలాగను - యిప్పటికైనా తెల్సిందా?-" అన్నాడధికారి హుందాగా నడుస్తూ ముందు కొచ్చి. బస్సుస్టేషన్ దగ్గర ఆగిందనేసరికి రైలు కూసింది. పోనీ నడుస్తున్న రైలు ఎక్కి-పోదామన్నా బ్రిడ్జిమీదించిపోవాలె. ఏంచెయ్యడానికీ పాలుపోలేదు. అలాగే వెయిటింగ్ హాల్లో వున్న బెంచీమీద కూలబడ్డాను.

---

కథానిక

# చేబదులు దంపతులు

ఓగేటి శివరామకృష్ణ

"ఏమండీ ఒకరూపాయుంటే బదులిస్తారా. ఆనకమావారొచ్చినతర్వాత అడిగిస్తాను." ప్రక్కవాటాలో విశాలాక్షి ఉదయం పదిగంటల వేళ, ప్రభాకరం భోజనంచేస్తూంటే, దొడ్డి గుమ్మానవచ్చి, వరలక్ష్మినిపిలిచి అడిగింది.

"ఏం—అండీ?" వరలక్ష్మి ఉన్నదీలేనిదీ తేల్చి చెప్పక అడ్డుప్రశ్న వేసింది!

"అఁ. ఏంలేదు. మంచి సవరాలొచ్చాయి. నల్లగా మంచిపొడుగ్గా ఉన్నాయి. రూపాయిన్నర అంటున్నాడులెండి. బేరం అడుతే... లెండి రూపాయకిస్తాడేమోనని!" అందివిశాలాక్షి.

"సవరాలా! మొన్న జబ్బుతో నా జుట్టంతా ఊడిపోయింది. నేనుగూడా ఒకటి కొనుక్కుంటే బాగుండునులెండి! నాదగ్గరయేంలేదు" అని ఊరుకుంది వరలక్ష్మి.

"మరేలాగండి! ఏలాగోలా సర్దుబాటు చెయ్యాలి." ఆనక మావారొచ్చినతర్వాత మీకు తప్పకుండా సర్దుబాటుచేయగల్ను" అని ధీమాగా అంది విశాలాక్షి.

"ఏంచేయమంటారు?"

"అన్నయ్యగారింట్లోనే ఉన్నారుగా... ఒక్కటేఒక్కరూపాయి అడిగిపుచ్చుకోండి. మా వారు రావటంతోటే మీచేతికే యిచ్చేస్తాను" అంది విశాలాక్షి.

వరలక్ష్మి కాదనలేకపోయింది.

"అసలాయనదగ్గర ఉన్నదోలేదో కనుక్కోవాలిగా" అనిమాత్రం యేలాగో అంది.

విశాలాక్షి అంతటితో ఊరుకుంటేగా.

"అదేమిటమ్మా! నెలకు నూటయాభై రూపాయలు జీతంపుచ్చుకుంటున్న మీవారిదగ్గర డబ్బుకు లోటేమిటి? తప్పకుండా ఉంటుంది" అంది.

వరలక్ష్మి మరి నోరు మెదపలేకపోయింది. ఆమె అన్నదానిలో అసత్యం ఏమైనా ఉంటేగా "కాదనటాని"కి. నెలకి నూటయాభైరూపాయలు సంపాదించుతున్నమాట వాస్తవం. పిల్లాపీచూ లేకపోవటంవల్ల యేకొద్ది మొత్తమో, ప్రతీనెలా బ్యాంకులో నిలవకు చేరుతూందనే మాటలో గూడా అసత్యం ఉండదు.

"సరే కనుక్కుంటానుండండి." వరలక్ష్మి లోపలకెళ్ళింది. మరి తానక్కడుండటం, తనకే నష్టంగా తోచిందికాబోలు, విశాలాక్షి, వెళ్ళిపోయి వీధిలో సవరాల అబ్బాయితో బేరాలు సాగిస్తోంది.

ఇంతవరకూ అన్నిమాటలూ, ప్రక్కనుంచే ప్రభాకరం వినిఉండటంవల్ల, తిరిగి వరలక్ష్మి విషయాలు చెప్పనవసరంలేకపోయింది.

"ఏమండీ! రూపాయి బదులుకావాలట."

"ఉహూ లేదే" అన్నాడు ప్రభాకరం.

"ఉన్నదో లేదో నాకేంతెల్సు! ఆవిడ అడిగింది. నూటయేభై రూపాయలు జీతం సంపాదించుకునే మీదగ్గర లేకపోవట మేమిటమ్మా అంది. లేదంటే నామాట నమ్మదు. పైగా అహం

భావం అనుకుంటుంది. అందువల్ల యేలాగూ యివ్వటం తప్పదు...ఉంటే యివ్వండి."

"నాదగ్గిర రెక్కాడుంది సరిగ్గా రూపాయిన్నరో యెంతో ఉండాలి. సేవింగ్సులోంచి డబ్బు తీసు కోటానికి, రేపటిదాకా నాకు కానీ లేదు... ఈమాత్రం అయినా జేబులో లేకపోతే మరెట్లా" అన్నాడు ప్రభాకరం.

"రూపాయిన్నరే ఉంది, నేనుగూడా ఓ సవరం బేరంఆడి కొనుక్కుందామనుకొన్నానే" అంది వరలక్ష్మి.

"ఏడ్చేదాని మొగుడువస్తే...నా మొగుడూ వస్తాడనే సామెత మనపట్ల రైటన్నమాట?" ప్రభాకరం అని నవ్వాడు.

వరలక్ష్మికి కోపంవచ్చింది: "పోనీ నాకవసరంలేదు. ఉన్నదీలేనిదీ తేల్చిచెప్పండి" అని నిష్కర్షగా అడిగింది వరలక్ష్మి.

"నీతో చెప్పటం అయిపోయిందిగా! వున్నది చేబదులు యిచ్చుకుంటావో లేక నువ్వు సవరం కొనుక్కుంటావో. ఏంచేసినా నా కభ్యంతరం లేదు. బజారునుంచి, మరి ఏ సరుకూమాత్రం ఈ రోజుకు తెచ్చేదిలేదు.

"బాగుంది" అని విసుక్కుంది వరలక్ష్మి.

"చెల్లెమ్మా!" అంటూ బయట విశాలాక్షి కేక వేసింది.

"ఆవిడ కేకవేస్తూంది లేదనిచెప్పనా" అంది వరలక్ష్మి కటువుగా.

"లేదంటావో, ఉందంటావో నీ యిష్టం" అంటూ భోజనందగ్గరనుంచి లేచాడు ప్రభాకరం.

"బాగుంది వరస" అని విసుక్కుందివరలక్ష్మి.

బట్టలు కట్టుకుంటూ "ఇదిగో రూపాయి!" అని వరలక్ష్మి చేతిలో పడేశాడు ప్రభాకరం.

"ఇవ్వమంటారా?"

"నీ యిష్టం."

"చెల్లెమ్మా!"

"దొంగ వరుసలన్నీ యిలాంటి సమయంలో పుట్టుకొస్తాయి" అని మనసులో అనుకుని, రూపాయి, తలుపుతీసి ఆమెచేతిలో పడేసింది.

"చెల్లెమ్మా బాగుందా?"

"ఊఁ..."

"పధ్నాలుగణాలకే బేరం ఆడాను."

"బాగుందమ్మా! నేనుగూడా కొనుక్కుంటే బాగుండిపోను."

"పోనీ కొనుక్కోనలేకపోయావా?"

"డబ్బు లేకపొయ్యాయి, తర్వాత కొనుక్కుంటాను."

"మళ్ళా కనిపించవోయ్, ఈవిడ మరొకటి కొనుక్కుంటుంది."

"అలాగేనండి" రూపాయి బిళ్ళ తీసుకు, రెండణాలు విశాలాక్షి కిచ్చి నిష్క్రమించాడు సవారలవాడు.

"చెల్లెమ్మా! ఈ బేడ నీదగ్గిర ఉంచమ్మా. మిగిలిన పధ్నాలుగణాలు, మావారొచ్చినతర్వాత నీకిస్తాను" అంది విశాలాక్షి. వరలక్ష్మి తెల్లబోయింది: "అంతా ఒకమారే యివ్వచ్చుగా! ఇప్పుడేం తొందర" అంది.

"దగ్గరవుంటే ఖర్చులు పోతుంది కదమ్మా! ఉంచు. పధ్నాలుగణాలు తర్వాత యిస్తానే!"

"నాదగ్గరమాత్రం ఖర్చవదూ? ఏకంగా ఒకేమారు యివ్వవచ్చు" అంది వరలక్ష్మి.

"నామాట వినమ్మా! ఇది ఉంచు." అని బలవంతంగా చేతులో పెట్టింది విశాలాక్షి.

వరలక్ష్మి తీసుకోనటం తప్పనిసరియైంది.

"వరలక్ష్మీ!"—ప్రభాకరం లోపలనుంచి కేక వేశాడు.

"ఆయిన కాఫీసు టైంఅయింది. తర్వాత మాట్లాడుకుందాం." అంటూ వరలక్ష్మి లోపలి కొచ్చేసింది.

"ఏమిటా గొడవ?"

"ఏముందీ?"—వరలక్ష్మి జరిగినదంతా చెప్పింది.

"బేడ యెందుకు పుచ్చుకున్నావ్?" భర్త గట్టిగా అన్నాడు.

"ఏంచేసేది. బలవంతంగా చేతిలో పెడితే"—అని కళ్ళనీళ్ళు పెట్టుకొంది వరలక్ష్మి.

"పిచ్చిదానా. నిన్ను నేనేం అన్నాను. డబ్బుల సంగతి చెబుతున్నానంతే! నువ్విచ్చిన రూపాయకూ, నీకు దక్కింది, దక్కేదీ యీ బేడమాత్రమే!" అన్నాడు ప్రభాకరం నెమ్మదిగా

"అంటే!"

"అంటే—నీ రూపాయకు ఆమె బేడ విలువ కట్టి యిచ్చింది. నీకు మరి ముట్టేది ఏంలేదు?" అన్నాడు బయటకువెళ్తూ! వరలక్ష్మి తెల్లబోయి

చూస్తూ నిల్చుండిపోయిందంతే!

*        *        *

తర్వాత ఒకవారంరోజుల చిల్లర గడచిపోయాయి. ప్రభాకరం కేవలం దెప్పే మిషతో రోజూ "పద్మాలుగణాలు వసూలయాయ్యా?" అని అడుగుతూనే ఉన్నాడు;

వరలక్ష్మి ఏం అని చెబుతుంది? రోజూ, తోచినట్లుగా తలోవిధంగా చెబుతూనే ఉంది: అయితే ప్రభాకరం గూడా ప్రతిరోజూ నీకు ముట్టవలసిన బేడయెప్పుడో ముట్టింది. మరి ముట్టేదిలేదు"అంటునే ఉన్నాడు.

వరలక్ష్మి మాత్రం యేం జవాబు యివ్వలేకపోతూంది. అవును. "మా వారొచ్చిన వెంటనే యిస్తానన్నావిడ —ఇంతవరకూ యివ్వలేదంటే చీమకుట్టనట్లుగా నటిస్తున్నదంటే— ఏంచేసేది? నోరు తెరుచుకు అడిగితే! ఛీ అంతకంటె అప్రదిష్ట మరొకటి ఉందా? పద్మాలుగణాలు గిరుక్కున త్రిప్పిపారేసి చిల్లర డబ్బులకు మొఖం చూసుకొన్నదనదూ? అందులోనూ విశాలక్షిది పెద్దకంఠం. ఆవిడ యెదురుపల్కటానికి పేటలో వాళ్ళంతా బెదురుతూనే ఉంటారు. మరలాంటప్పుడు ఏంచేసేది? కష్టార్జితంసొమ్ము పద్మాలుగణాలకు తర్పణాలు వదిలివేయవల్సిందే?

వరలక్ష్మి తికమక పడుతూనే ఉంది: నోరు తెరచుకు"డబ్బిస్తారా"అని అడగలేకపోతున్నది.

మరో రెండురోజులు గడిచాయ్. వరలక్ష్మి తన డబ్బుమాత్రం వసూలుచేసుకోనలేదు.

ఆ మధ్యాహ్నం వీధివాకిట కూర్చుండి ఏదో కబుర్లు కాలక్షేపం చేస్తున్నారు ఆడవాళ్ళంతా.

"చీరెలు రవికల గుడ్డలంటూ" చీరలవ్యాపారి ఒకడు అలా వచ్చాడు.

"మంచి రవికల గుడ్డలున్నాయా?" విశాలక్షి అడిగింది

"ఉన్నాయంటూ" వచ్చాడతను.

రకరకాల'గుడ్డలు చూశారు అమ్మలక్కలు. బేరసారాలు జరుగుతున్నాయ్.

వరలక్ష్మికో యోచన కలిగింది! తానుగూడా గుడ్డకొనే మిషతో డబ్బులడిగితే! "బాగుంది" అనుకొంది వరలక్ష్మి.

విశాలాక్షి చేతినిండా డబ్బు ఉన్నట్లుగా, రెండుమూడు గుడ్డలు చింపించుకుంది, వరలక్ష్మి గూడా ఒకగుడ్డ తీయించుకోవాలని ఉంది; తన దగ్గర రూపాయున్నరో పైనో ఉంది కూడాను!

"ఆ గుడ్డ బాగుంది! నేనుగూడా ఒక రవికకు సరిపోయేది పుచ్చుకుంటాను. రెండురూపాయలు కావాలి. నా దగ్గిర ఒక రూపాయి మాత్రమేఉందిఎలాగ?" అనుతూ అంది వరలక్ష్మి.

ఎవరికివారు తమతమ జాగ్రత్తలో ఉన్నారు. అందులో యే ఒక్కళ్ళూ వరలక్ష్మి గోడవ పట్టించుకోలేదు. విశాలాక్షి విని, ఒకమారు వరలక్ష్మి వయిపు చూసి తల దించేసుకొన్నదిగాని, మాటాడిన పాపానపోలేదు.

ఇది వరలక్ష్మి గమనించింది. విశాలాక్షి నోరు మెదపనందుకు ఆశ్చర్యపడింది. మరోవిధంగా ప్రయత్నిస్తే ఫలితం కన్పించవచ్చనే ఉద్దేశ్యంతో పేరుపేరునా అక్కడ ఉన్న అమ్మలక్కలందరినీ"రూపాయిబదులు పెడతారా! మావారొచ్చిన తర్వాత యిస్తాను"అని అడిగింది.

ప్రతీవాళ్ళూ లేదు పొత్వం, దాకు కొమ్మి యిచ్చారు. తన యీ యుక్తి పారనందుకు వరలక్ష్మి బాధపడింది. మరి చివరి ప్రయత్నంగా,

"ఏమండీఅక్కయ్యగారూ?" అంటూ నెమ్మదిగా విశాలక్షిని సంబోధించింది.

ఒక్కమారు విశాలక్షి వరలక్ష్మివైపు చూసి తల దించేసుకొంది!

"మిమ్మల్నేనండీ!"

"నన్నేనా... ఎవరినో అనుకొన్నాను... ఏమిటి?" ఏమీ ఎరగనట్లుగా అంది విశాలక్షి!

"నాకు రూపాయిబాపతు పద్మాలుగణాలు యివ్వాలి గదా! నాదగ్గిరో రూపాయి ఉంది. ఇప్పుడు యిస్తే యీరకం గుడ్డ మీతోబాటు నేనూ కొనుక్కుంటాను"అంది వరలక్ష్మి,

"నీ పద్మాలుగణాల బాకీ నేను మరచిపోలేదమ్మా! ఎప్పటికప్పుడు యిద్దామనుకొని మరచిపోతున్నాను. అనక మావారొచ్చిన తర్వాత, అడిగి యిస్తానులే" అంది కఠోరంగా విశాలక్షి.

"అది కాదండీ! నాకూ రవికలగుడ్డ కొనుక్కోవాలని ఉంది. మీ రివ్వరని కాదు. ఏమయినా ఉంటే యివ్వండి!" అంది వరలక్ష్మి!

"నా రెండు రవికల గుడ్డలకూ నాల్గురూపాయలు నాకే కావాలి! నేను మీకెక్కడతెచ్చి యిచ్చేది?" అంది విశాలక్షి.

ఇంతక్రితం — తెనకూ సవరం కావలసేయుం డినా— ఆవిడ అడగటం తడవుగా ఉన్న ఒక్క రూపాయీ తానివ్వలేదూ? ఈ సంగతి తలుచు కొనేసరికి. వరలక్ష్మికి కళ్ళనీళ్లు తిరిగాయ్.

"పోనీలెండి. ఉంటే యిస్తారనుకున్నాను. మీ డబ్బు సంబర్భంలో మీ తరువాత వాళ్ళమే గదా! ఉంటే యివ్వండి. లేకపోతేలేదు." అంది వరలక్ష్మి.

"నేమాత్రం యేమన్నానుకి?"అంది విశాలాక్షి.

మరక్కడ కూర్చోటం, అసహ్యం కలిగించింది వరలక్ష్మికి. అక్కడ మూకంతా స్వార్థపరులన్న సంగతి ఆమెకు తెలుసు! అయితే వి శా లా క్షి నోరు పెద్దదవటంవల్ల తమ వస్తువులామెచేత పడ కుండా జాగ్రత్తగా ఉంటున్నారు వాళ్లు. ఇక అక్కడ ఉండకుండా లోనికొచ్చేసింది. సాయం కాలానికి తన పద్మాలుగణాలు తప్పక వస్తాయని ప్రభాకరంచేత అలాంటిగుడ్డలు బ జా రు ను ం చి తెప్పించుకుందామని యేమో తలపోసింది పిచ్చి వరలక్ష్మి.

సాయంకాలం అయింది. విశాలక్షి భర్త యింటికీ వచ్చాడు, ఆయన భార్య చేతిలో కీలు బొమ్మ! ఎంతో చవకగా గుడ్డలు కొన్నావని భార్యనాయన పొగిడేస్తున్నాడు.

ఇంతక్రితం ఘర్షణ జ ర గ ట ం వల్ల ఆయన యింటికి రావడంవల్లా, తనడబ్బులు, చేతులో పడ తాయని వరలక్ష్మి ఊహించింది. కాని అలాటి ఉద్దేశ్యం అసలు విశాలాక్షిలో లేనేలేనప్పుడు తానేంచేస్తుంది?

డబ్బులేమీ ఊడిపడలేదు. చీకటిపడింది. ఉత్సాహంగా ప్రభాకరంమాత్రం ఇంటికివచ్చాడు వరలక్ష్మిమొహం చిన్నబోయినట్లుగా గుర్తించా డతను.

"ఏం-అలాఉన్నావ్?"వరలక్ష్మి జరిగినదంతా చెప్పింది! "ఓస్ యీమాత్రానికే నిజంగా మనం అదృష్టవంతులం. ఈ పద్మాలగణాలతోటే మన శనివదలిపోయింది. నీకు కావాలంటే అలాటి గుడ్డలు రేపుతెచ్చిపెడ్తా"అన్నాడతను.

"అదృష్టవంతులం అంటారేమిటి?" ఆశ్చర్య పోతూ ప్రశ్నించింది వరలక్ష్మి.

"నిజంగానే! వాళ్లెవళ్లో తెలుసా? చేబదుళ్ళ దంపతులు. ఆరుమాసాలబట్టి యిక్కడ నౌకరీ చేస్తున్నాగాని నాకేం తెలియదీరోజువరకూ" అన్నాడు ప్రభాకరం.

"అంటే?"

"అంటే. చాలాఉందిలే! ఇటు భార్యగారు రూపాయలు చేబదుళ్ళడిగితే అటు భర్తగారు, అర్థలూ, పావులాలూ చేబదుళ్ళడుగుతారట! ఈ ఊరొచ్చి, అప్పుడే, ఆరుసంవత్సరాలైందట. ఈ ఆరుసంవత్సరాలనుంచి, ఈ పట్టణం అంతా ఉద్ధ రించటం అయిపోయిందంట. ఇంతకాలానికి ఈ వీధికి వచ్చారట. అయితే ఓ సంగతి. ఇందాకా నా స్నేహితుడు రాజేశ్వర్రావుచెప్పాడు. వాళ్ళకు అంటే అలాటిరకంకి డబ్బు ఒక్కతూరి బదులిచ్చి తిరిగి అడగకూడదు. పదిమార్లు అడ్గా, అడ్గా విసుక్కుని, కసురుకుని ఇచ్చినా, తర్వాత మరో పెద్ద మొత్తానికి యెసరువేస్తారట!"

"ఊహూ. అందుకని..."

"అందుకనీ, వాళ్ళడిగినప్పుడు యేదోయిచ్చి ఊరుకుంటే మరి మనకు వాళ్ళు తిరిగియిచ్చేది లేదు. ఈ మొదటిమారుతో మరి ముఖంచెల్లక, తిరిగి అడగటం జరగదు. ఇక అది వాళ్ళిచ్చేదీ లేదు, మనం పుచ్చుకునేదీలేదు.

"బాగుంది! అలాగని మనకు రావలసింది వదు లుకుంటామా?"

"ఒదులుకోనటమే చాలా ఉత్తమం! తర్వాత, యిప్పుడిచ్చినా, మళ్ళా చేబదులుకోసం వేధించు కుతింటారు. లేదనలేని, మనబోటిమెత్తటివాళ్ళు తప్పక యిస్తుంటారు. అందువల్ల మరింతగొడవ" అన్నాడు ప్రభాకరం.

"మీరన్నమాట నిజమే"అంది వరలక్ష్మి.

"నువ్వు మరి అడక్కు. నిజంగా మనం అదృ ష్టవంతులం"అన్నాడు ప్రభాకరం భోజనానికి లేస్తూ.

"సరే"అంది వరలక్ష్మి.

*   *   *

వరలక్ష్మి, తిరిగి విశాలాక్షిని పద్మాలుగణాలు అడగలేదు. విశాలాక్షి తిరిగి ఏమీ చేబదులడగటం లేదుగాని అప్పుడప్పుడు మాత్రం ఆనక మావారొ చ్చినతర్వాతయిస్తాను! ఎప్పటికప్పుడే మరచిపోతు న్నాను"- అంటూనే ఉంటుంది.

వరలక్ష్మి నవ్వుతూ: "తొందరేంలెండి"— అంటూ ఉంటుంది.